

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి


సిఎం చంద్రబాబు పర్యటనలో లైవ్ శానిటేషన్ అమలు

డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - పోలవరం

ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్ట్ సందర్శించనున్న సందర్భంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూత్తిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా లైవ్ శానిటేషన్ అమల్లోకి తెస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 150 మంది శానిటేషన్ కార్మికులను పారిశుధ్య కార్యక్రమాలకు వినియోగించగా 80 మంది పంచాయతీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గూటాల, పట్టిసీమ, పోలవరం గ్రామ పంచాయతీల్లో చంద్రబాబు పర్యటన దృష్ట్యా పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని తెలిపారు.

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత



ఏలూరు జెసి లావణ్యవేణితో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పోలవరం

ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నట్లు నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతతోపాటు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఎస్‌పి మేరీప్రశాంతి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అంశాలవారీగా సంబంధిత అధికారులతో ఆదివారం ప్రాజెక్టు డ్యామ్ వద్ద సమావేశ మందిరంలో జెసి ఆధ్వర్యాన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిగా ఏలూరు జిల్లాకు విచ్చేస్తున్న సిఎం పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేసి, సమన్వయంతో పని చేయాలని సూచించారు. 17వ తేదీ ఉదయం పది గంటలకు సిఎం చంద్రబాబు పోలవరం డ్యామ్ సైట్లోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటున్నారన్నారు. ప్రజాప్రతినిధులను కలుసుకున్న అనంతరం వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం పోలవరం డ్యామ్ సైట్ ప్రాంతంలో వివిధ పనుల ప్రగతిని పరిశీలిస్తారన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు, జెసి, ఎస్‌పి

స్పిల్ వే, గైడ్‌బండ్, గ్యాప్-1, 2, 3, అప్పర్ స్ట్రీమ్ కాపర్ డ్యామ్, డౌన్ స్ట్రీమ్ కాపర్ డ్యామ్, పవర్ హౌస్‌ను పరిశీలిస్తారని వివరించారు. పరిశీలిస్తారు. సిఎం పనులను పరిశీలించే ప్రాంతాల్లో పూర్తి వివరాలను అందజేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. తొలుత ఎస్‌పి మేరీ ప్రశాంతితో కలిసి సిఎం పర్యటించే ప్రాంతాలను, అక్కడ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, పోలవరం ప్రాజెక్టు ఎస్ఇ నరసింహమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నిమ్మల

సిఎం చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించనున్న దృష్ట్యా పర్యటనా ఏర్పాట్లను రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆదివాకం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రాజెక్టు పనుల్లో ప్రతి అంశంలో వాటి నిర్మాణ ప్రగతిని ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలిస్తారని, ఆయా ప్రాంతాలలో ఇంజినీరింగ్ సిబ్బంది పనుల ప్రగతిని ముఖ్యమంత్రికి తెలియజేయాలని అన్నారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిని ఆదేశించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతిని ఆదేశించారు.



అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి, జెసి లావణ్యవేణి

నేడు చంద్రబాబు పర్యటన సాగేదిలా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు ప్రాజెక్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సిఎం చేరుకుంటారు. ముందుగా అధికారులు, రాజకీయ నాయకులతో మాట్లాడనున్నారు. 10.10 గంటలకు వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టును పరిశీలిస్తారు. అనంతరం స్పిల్‌వే గైడ్‌బండ్, కాపర్ డ్యామ్ గ్యాప్‌లు, పవర్‌హౌస్ ప్రాజెక్టు పనులన్నింటినీ స్వయంగా పరిశీలిస్తారు. అనంతరం కొండపై ఉన్న గెస్ట్‌హౌస్‌కు చేరుకుని 2 గంటలకు మధ్యాహ్న భోజనం చేస్తారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. నాలుగు గంటలకు మీడియాతో మాట్లాడతారు. ఐదు గంటలకు హెలికాప్టర్‌లో తిరిగి ప్రయాణమవుతారు.



ఉంగుటూరు రైల్వే గేటు సమీపంలో మురుగు పరిస్థితి

ఇరిగేషన్ బోదెలో పరిశ్రమల వ్యర్థాలు

దుర్వాసన, దోమలతో జనం అవస్థలు

ఆందోళనలో ఉంగుటూరు ప్రజలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు-ప్రకాశరావుపాలెం మార్గం లో ఉంగుటూరు పంచాయతీ పరిధిలోనివలు ఆక్వా ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఇతర ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలు ఇరిగేషన్, మురుగు కాలువల్లో కలుస్తున్నాయి. దీంతో పర్యావరణం కాలుష్యమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరు ఇండస్ట్రియల్ హబ్‌గా ఉన్న సంగతి తెలిసిందే. చేపలు, రొయ్యలు ప్రాసెసింగ్, పేపర్, అట్టలు, థర్మాకోల్ పెట్టెల తయారీ, ఐస్ పరిశ్రమలు ఇలా అనేక కర్మాగారాలతో వేలాది మందికి జీవనోపాధి, ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్నాయి. ఆయా పరిశ్రమల్లో వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాత బయటకు వదలాల్సిన మురుగు, వ్యర్థాలను మురుగుకాలువల్లోకి వదిలేయడంతో పరిస్థితి క్షీణిస్తోందని గ్రామస్తులు అంటున్నారు. తెలికిచెర్ల, ప్రకాశరావుపాలెం తదితర ఎగువ ప్రాంతాల నుంచి వర్షం, వరద నీరు, సాధారణ రోజుల్లో ఫ్యాక్టరీ వ్యర్థాల నుంచి వచ్చే మురుగు అంతా ఉంగుటూరు రైల్వే గేటు పక్క నుంచి ప్రవహించి జాతీయ రహదారి, ఏలూరు ప్రధాన కాలువ అండర్ టన్నెల్-4 (యూటి) నుంచి కొల్లేరులోకి వెళ్లే మార్గం ఎప్పటి నుంచో ఉంది. అయితే ఆయా బోదెలు, కాలువలను మరమ్మతు చేయకపోవడం, నిర్వహణ లోపం కారణంగా మార్గాలు పూడుకుపోవడంతో ఎక్కడికక్కడే మురుగు నిల్వ ఉండిపోతుంది.

దుర్వాసన, దోమలతో వ్యాధులు

ఇరిగేషన్ బోదెలో స్థానిక రైల్వే గేటు నుంచి ఎర్రచెరువు వరకూ మురుగునీరు రంగు మారి పురుగులు, నాచు, సిల్ట్‌తో చూడటానికే భయంకరంగా నలుపు రంగులో ఉంటోంది. వాటి నుంచి పెద్దఎత్తున దోమల విజృంభణతో స్థానిక ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధాన రోడ్డు వెంబడి ప్రభుత్వ జెడ్‌పి ఉన్నత పాఠశాల, 13 దేవాలయాలకు రక్షిత తాగునీటిని అందించే రక్షిత తాగునీటి పథకం, చెరువు ఉండటం గమనార్హం. ముక్కుపుటలు అదిరిపోయేలా దుర్వాసనతో నిత్యం వందలాది మంది విద్యార్థులు ముక్కు మూసుకుని ఈ మురుగు కాలువ వెంబడి పాఠశాలకు వెళ్లాల్సి ఉంటోంది. ఇంతటి జన సంచారం ప్రాధాన్యత కలిగిన మురుగు బోదె కాలుష్య కారకం మారినా కాలుష్య నియంత్రణ బోర్డు, ఇరిగేషన్, ప్రజారోగ్య శాఖ, వైద్య ఆరోగ్య శాఖల యంత్రాంగం ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

దోమల వల్ల తలుపులు తీయలేకున్నాం

జి.సుబ్బారావు, స్థానిక నివాసితుడు

మురుగు బోదె పక్కనే మా ఇల్లు. నల్లగా రంగుమారి దుర్వాసన, దోమలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రేయింబవళ్లు దోమల బారి నుంచి తప్పించుకునేందుకు ఎప్పుడూ తలుపులు మూసుకోవాల్సి వస్తోందంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇక్కడే జైలు మాదిరిగా నాలుగు గోడల మధ్య ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. మురుగు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు దిగువకు వెళ్లిపోయేలా శాశ్వత చర్యలు తీసుకుని ప్రజారోగ్యం రక్షించాలి.

పూడికను పరిశ్రమల నిర్వాహకులతోనే తీయిస్తాం

గిరిధర్, పంచాయతీ కార్యదర్శి

ఇది ఇరిగేషన్ శాఖకు చెందిన మేజర్ బోదె. మెట్ట ప్రాంతంలో ఎగువ ప్రాంతాల నుంచి వర్షం, వరద నీటితోపాటు పంచాయతీకి చెందిన ఇళ్లల్లో వాడుక నీరు కూడా ఇదే బోదెలో కలుస్తుంది. ఈ బోదెల నిర్వహణ ఆయా పరిశ్రమల యజమానులే చేయాల్సి ఉంది. ఫ్యాక్టరీ ఓనర్లతో మాట్లాడి వారి జెసిబిలతో మురుగంతా దిగువకు వెళ్లేలా తప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఫ్యాక్టరీ లాభాలు యజమానులకు పూడికతీత ఖర్చు పంచాయతీ నుంచి ఎందుకు వెచ్చిస్తాం. పరిశ్రమల యజమానులతోనే తీయిస్తాం. నోటీసులు సిద్ధం చేస్తున్నాం. స్థానికులు మురుగు సమస్యపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గం దృష్టిలోనూ ఈ సమస్య పెట్టాం. సర్పంచి కూడా పరిశ్రమల నిర్వాహకులతో మాట్లాడనున్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలి

రైతుకూలీ సంఘం సదస్సులో రిటైర్డ్ ఐపిఎస్ అధికారి వి.వి.లక్ష్మీనారాయణ

మరో ఉద్యమానికి రైతాంగం సిద్ధం కావాలి: ఏపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు

కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాలు పెరగాలి : ఏపి వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని రిటైర్డ్ ఐపిఎస్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ అన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల్లో రెండో రోజు ఆదివారం మధ్యాహ్నం 'గ్రామీణ యువత-వలసలు-నిరుద్యోగం' అనే అంశంపై జరిగిన సదస్సుకు పేక్ భాషా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ ఆధారిత, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పాల్సి ఉందన్నారు. దీంతోపాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసినప్పుడు మాత్రమే వలసలను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వాలు ఉపాధి కల్పించని కారణంగా యువత రష్యా, ఇజ్రాయిల్, గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లి యుద్ధాల్లోనూ, ప్రమాదాల్లోనూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మోడీ ప్రభుత్వం యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీని ఆచరణలో నెరవేర్చలేదన్నారు. ఉపాధి సమస్య పరిష్కారం కోసం మనమంతా ఐక్యంగా ఉద్యమించి డిమాండ్ చేయాలన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను ఉద్దేశపూర్వకంగా భర్తీ చేయకుండా విదేశీ పెట్టుబడులతోనే పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తామంటూ పాలకవర్గాలు యువతను దగా చేస్తున్నాయన్నారు. 'భూమి సమస్య- సామాజిక న్యాయం' అనే అంశంపై జి.సునీత అధ్యక్షతన జరిగిన సదస్సులో దళిత బహుజన మహాసభ నాయకులు వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజలకు భూమి దక్కాలని, దాని కోసం పోరాడాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు అవసరమన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, ఈ విషయంపై కనీసం చర్చించకపోవడం అన్యాయమని విమర్శించారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టంతోపాటు భూపంపిణీ, రైతాంగ సమస్యలపై స్వామినాథన్ కమిషన్ అనేక సిఫార్సులు చేసినప్పటికీ ప్రభుత్వాలు వాటిని పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మరో ఉద్యమానికి రైతాంగం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతదేశంలో కార్పొరేట్ కంపెనీలు వ్యవసాయ రంగాన్ని కబళిస్తున్నాయన్నారు. ఎర్ర జెండా నీడలోనే దీనికి పరిష్కారం దొరకుతుందని తెలిపారు. అట్టడుగున ఉన్న కూలీలు వలసలు పోతున్నారని, రైతులతోపాటు వ్యవసాయ కార్మికులు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక, కర్షక ఐక్య ఉద్యమమే దీనికి పరిష్కారమని సూచించారు.



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వర్లు

స్కూల్ బస్సులపై గట్టి నిఘా

పూర్తిస్థాయి కండిషన్‌లో ఉండేలా చర్యలు

జిల్లా ఉప రవాణ కమిషనర్ ఎస్.శాంతకుమారి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల బస్సులపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామని ఏలూరు జిల్లా ఉప రవాణ కమిషనర్ ఎస్.శాంతకుమారి చెప్పారు. విద్యార్థులను తరలించే ప్రతి బస్సు కండిషన్‌లో ఉండేలా చర్యలు చేపట్టేందుకు పూర్తిస్థాయిలో రంగం సిద్ధం చేశామని తెలిపారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఆమె పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న : జిల్లా వ్యాప్తంగా (పాఠశాల బస్సులు ఎన్ని ఉన్నాయి? వాహన దారుఢ్య పరీక్షలు ఎన్ని పూర్తి చేసుకున్నాయి?

డిటిసి: జిల్లా వ్యాప్తంగా 869 పాఠశాల బస్సులు ఉన్నాయి. వాటిలో 682 పాఠశాలల బస్సులు వాహన దారుఢ్య పరీక్షలు పూర్తి చేసుకున్నాయి. మిగిలిన 187 బస్సుల పరీక్షపై జిల్లావ్యాప్తంగా ఉన్న రవాణా అధికారులతో పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేశాం.

ప్రశ్న : జిల్లావ్యాప్తంగా పాఠశాలల బస్సులపై తనిఖీలు ఏమైనా నిర్వహిస్తున్నారా?

డిటిసి : జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల బస్సులను ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాం. ఫిట్‌నెస్ పూర్తికాని బస్సులు వాహన తనిఖీ అధికారులకు ఎదురుపడితే వెంటనే వాటిపై కేసులు నమోదు చేస్తున్నాం. మరికొన్ని సందర్భాల్లో విద్యార్థులను ఇంటికి చేర్చి ఆ బస్సులను సీజ్ చేస్తున్నాం.

ప్రశ్న : ప్రస్తుతం పాఠశాల బస్సుల్లో జీవితకాలం పూర్తయినవి ఏమైనా గుర్తించారా?

డిటిసి : ప్రతి ఏడాది కొన్ని పాఠశాలలకు సంబంధించి కొన్ని కొత్త బస్సులను కొనుగోలు చేసి పాత బస్సుల స్థానంలో వాటిని మార్పులు చేస్తూ ఉంటారు. కచ్చితంగా జీవితకాలం ముగిసిన బస్సులను సీజ్ చేసేందుకు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర కార్యాలయాల నుంచి ఆదేశాలు ఉన్నాయి. 15 ఏళ్లకు పైబడిన బస్సులు తారసపడితే సీజ్ చేసి రవాణా శాఖ కార్యాలయానికి తరలిస్తాం.

ప్రశ్న : గతేడాది విద్యార్థులు తరలించే బస్సు ప్రమాదానికి గురైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది వాటిని అధిగమించటానికి ప్రత్యేక ప్రణాళికలు ఏమైనా ఏర్పాటు చేశారా?

డిటిసి : రవాణా శాఖలో ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా రవాణా అధికారులు రాష్ట్ర, జిల్లా కార్యాలయాల నుంచి కూడా ఉంటారు. వీరు ఎప్పటికప్పుడు సాధారణ వాహనాలతో పాటు పాఠశాల వాసులను కూడా తనిఖీలు నిర్వహించేందుకు ఆదేశాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు వీటిని తనిఖీ చేస్తూనే ఉంటాం. సాధారణంగా ఫిట్‌నెస్ పూర్తి చేసుకున్నప్పటికీ వాహనాల్లో కొన్ని సందర్భాల్లో యాంత్రిక లోపాలు తలెత్తుతాయి. వాటిని ఎలా అధిగమించాలోదానిపై కూడా డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : సాధారణంగా పాఠశాల బస్సులు కలిగి ఉండాల్సిన పత్రాలు ఏంటి?

డిటిసి : విద్యార్థులను తరలించే వాహనాలే కాకుండా సాధారణ రవాణా వాహనాలు వాహనదారుడి పత్రాలు పరిమిట్, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ ట్యాక్స్ కచ్చితంగా కలిగి ఉండాలి. వాటిలో ఏమి అందుబాటులో లేకపోయినా వారిపై కేసులు నమోదు చేస్తాం.



ప్రశ్న : డ్రైవర్లకు మీరిచ్చే సూచనలు, సలహాలు ఏమైనా ఉన్నాయా?

డిటిసి : పాఠశాల బస్సులను నడిపే డ్రైవర్ల వయస్సు కచ్చితంగా 60 ఏళ్ల లోపు వారు మాత్రమే ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపేందుకు పాఠశాల యాజమాన్యం అనుమతి ఇవ్వరాదు. ఇప్పటికే ఆయా పాఠశాల ప్రాంగణాల్లో రవాణా అధికారులు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపకూడదన్న అంశంపై వారికి ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. వాహన ప్రమాదాలు దాదాపు 80 శాతం మానవ తప్పిదాల వల్లే చోటు చేసుకుంటున్నాయి.

ప్రశ్న : ఒకవేళ పాఠశాల బస్సు ప్రమాదానికి గురైతే, ఆ వాహనం ఇన్సూరెన్స్ కలిగి లేకపోతే బస్సు యాజమాన్యంపై కఠిన చర్యలు ఏమైనా ఉంటాయా?

ప్రమాదం జరిగే సమయానికి వాహనం ఇన్సూరెన్స్ కలిగి లేకపోతే మోటార్ వాహన చట్టం 1980 ప్రకారం ఇందులో నూతనంగా 2019లో ఇన్సూరెన్స్ యాక్ట్‌ను అమెండ్మెంట్ చేశారు. ఈ యాక్టు ప్రకారం వాహన యజమాని ఆస్తి నుంచి నష్టపరిహారం చెల్లించాలి.

ప్రశ్న : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యక్రమం ఏమైనా చేపడుతున్నారా?

పాఠశాల, కళాశాల ప్రాంగణాల్లో రవాణా శాఖ అధికారులతో విద్యార్థులతో, పాఠశాల బస్సుల డ్రైవర్లతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తునాం. ప్రమాదాలకు గురవకుండా అంశాలపై అవగాహన ఒకవేళ పొరపాటున ప్రమాదానికి గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనంతరం నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలు, పలు అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : పాఠశాల యాజమాన్యాలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమైనా ఉన్నాయా?

డిటిసి : విద్యార్థులను తరలించే బస్సులో డ్రైవర్‌తో పాటు ఒక అటెండర్ తప్పనిసరిగా ఉండాలి. అటెండర్లు విద్యార్థులను రోడ్లు దాటించే ప్రక్రియ చేపట్టాలి. జాగ్రత్తగా దించడం, ఎక్కించడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదాలు జరగకుండా విద్యార్థులను చూసుకోవాల్సిన బాధ్యత పూర్తిగా విద్యాసంస్థల యాజమాన్యాలపైనే ఉంది. అనుభవం కలిగిన వాహన చోదకులను, అటెండర్లను వినియోగిస్తే కచ్చితంగా రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది.

రూ.60 కోట్లతో టైల్స్ ఫ్యాక్టరీలో కొత్త యంత్రం

ప్రారంభించిన హెచ్‌ఆర్ హెడ్ టి.ఈశ్వర్ దంపతులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలోని ప్రిజం జాన్సన్ లిమిటెడ్ (టైల్స్ పరిశ్రమ)లో రూ.60 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అధునాతన కొత్త కిలీన్ యంత్ర పరికరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఫ్యాక్టరీ హెచ్‌ఆర్ హెడ్ టి.ఈశ్వర్ దంపతులు పూజలు నిర్వహించిన యంత్రాన్ని ప్రారంభించారు. నాణ్యమైన టైల్స్ అందించేందుకు ఈ ఈ యంత్రం దోహదపడుతుందని, రోజుకి 20 వేల చదరపు అడుగుల నాణ్యమైన టైల్స్ ఉత్పత్తి అవుతాయని తెలిపారు. గతంలో మూడు కిలీన్ యంత్రాలతో రోజుకి 25 వేల చదరపు అడుగుల టైల్స్ ఉత్పత్తి అవ్వగా ఈ ఒక్క యంత్రంతో రోజుకి 20 వేల చదరపు అడుగులు టైల్స్ ఉత్పత్తి చేయడం వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ హెడ్స్ సమీర్ రంజన్ జాన, సునీల్ కుమార్ సీతి, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



కొత్త యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఈశ్వర్ దంపతులు

సిఎం చంద్రబాబును కలవనున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పరిశీలించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబును నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నాయకులు కలవనున్నారు. చంద్రబాబు పోలవరం సందర్శన చేస్తుండగా ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆధ్వర్యంలో నిర్వాసిత మండలాల నాయకులు కలవనున్నారని సిపిఎం పోలవరం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు తెలిపారు. త్యాగం చేసిన నిర్వాసితులకు సమగ్ర న్యాయం చేయాలని, నిర్వాసిత సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ముదినేపల్లిలో గాలి, వాన బీభత్సం

ప్రజాశక్తి - ముదినేపల్లి



జలమయమైన రోడ్డు

మండల కేంద్రమైన ముదినేపల్లి, పరిసర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన బీకర గాలి, వానకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఉరుముల శబ్దంతో పిల్లలు, మహిళలు, వృద్ధులు భయపడ్డారు. సుమారు గంటపాటు వర్షం పడింది. భారీ వర్షంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లోని నివాసాల చుట్టూ వర్షపు నీరు చేరడంతో పలు కాలనీల వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారులపై ఉన్న భారీ గుంతల్లో వర్షపు నీరు చేరింది. దీంతో ద్విచక్ర వాహనదారులకు దారి కనబడక ఇక్కట్లు పడ్డారు. బీకర గాలికి మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లపై పిడుగులు పడటంతో విద్యుత్ శాఖకు నష్టం కలిగింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో వర్షం తగ్గిన అనంతరం వెంటనే విద్యుత్ సిబ్బంది రంగ ప్రవేశం చేసి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రైతుల హర్షం

గంటపాటు కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే రైతులు చేల్లో విత్తనాలను వెదజల్లారు. వరుణుడు రాక కోసం ఎదురు చూస్తున్న ఈ తరుణంలో మండలంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో ఖరీఫ్ సాగు పనులు మరింత ముమ్మరంగా సాగే అవకాశం ఉంది.

రాష్ట్రాభివృద్ధికి సిఎం చర్యలు

చంద్రబాబును కలిసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లే సామర్థ్యం చంద్రబాబుకే ఉందని, జాతీయస్థాయిలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని టిడిపి ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. అమరావతిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారన్నారు.




చంద్రబాబుతో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

చదువంటే చాలా ఇష్టం

56 మందికి సైకిళ్లు అందించిన దాత రామారావు

ప్రజాశక్తి - ముసునూరు

తనకు చదువంటే చాలా ఇష్టమని, చదువుకోవడానికి గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని దాత రాయ్యంకుల రామారావు తెలిపారు. ఆదివారం మండలంలోని గుడిపాడు హైస్కూల్‌లో ఇతర గ్రామాల నుంచి వస్తున్న 56 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ ఆయన చేపట్టారు. ప్రతి ఒక్కరికీ ఒక్కో కొత్త సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని ఉపయోగించుకుని బాగా చదివి ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇప్పటికే స్కూల్ అభివృద్ధికి వివిధ పనులకుగాను రూ.ఏడు లక్షల వరకూ వెచ్చించానన్నారు. వలసపల్లి, గుళ్లపూడి గ్రామాలతోపాటు గుడిపాడులో దూర ప్రాంత విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేశారు. దీనిపై ఉపాధ్యాయ సిబ్బందితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, టిడిపి నాయకులు కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, మేదరమెట్ల సురేంద్ర, పలువురు నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న దాత రామారావు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

మంత్రి, ఎంఎల్ఏ కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని నూజివీడు ఎంఎల్ఏ కొలుసు పార్థసారథి అన్నారు. మంత్రి హోదాలో కొలుసు పార్థసారథి మొదటిసారి నూజివీడు నియోజకవర్గానికి విచ్చేశారు. నూజివీడు మండలంలోని సీతారాంపురం గ్రామం వద్ద గజమాలతో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ నూజివీడు ప్రజలకు ఋణపడి ఉంటానని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.



పార్థసారథికి గజమాలతో స్వాగతం



మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్రలతో ఎంఎల్ఏ ధర్మరాజు

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

మంత్రులను కోరిన ఉంగుటూరు ఎంఎల్ఏ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్ర పౌరసరఫరాలు, ఎక్సైజ్ శాఖల మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్రలను ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటించాలని ఎంఎల్ఏ పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఆదివారం ఆయన ఇద్దరు మంత్రులను మచిలీపట్నం, తెనాలిలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులకు సహకరించాలని మంత్రులను కోరినట్లు తెలిసింది. త్వరలో నియోజకవర్గంలో పర్యటిస్తామని మంత్రులు రవీంద్ర, మనోహర్ హామీ ఇచ్చినట్లు ఎంఎల్ఏ ధర్మరాజు చెప్పారు. ఆయనతో పాటు టిడిపి కూటమి నాయకులు కృష్ణంరాజు, పాతూరి విజయకుమార్, వంగా రఘు, చింతలపాటి బాసిరాజు, పొత్తూరి కృష్ణంరాజు ఉన్నారు.

ఎంపీ పుట్టా మహేష్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కర్ణాటకలోని పిఎస్ఎస్ ఇఎంఆర్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఎఎల్‌యుఎంఎన్ఐ మీట్ 2024-2025కి ముఖ్య అతిథిగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు. స్కూల్ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తాను చదువుకున్న స్కూల్‌కి వెళ్లారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఎంపీ మహేష్‌ని సత్కరించారు.



మాట్లాడుతున్న మహేష్‌కుమార్

విధుల్లోకి తీసుకోవాలని వాలంటీర్ల వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

వైసిపి నాయకుల మాటలు నమ్మి మోసపోయమని, తమకు న్యాయం చేయాలని మండలంలో ఉన్న వాలంటీర్లందరూ టిడిపి మండలాధ్యక్షులు, ఎంపిటిసి సభ్యులు ములిశెట్టి నాగుకు సిఐటియు మండల కార్యదర్శి సాయికిరణ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. తమను పట్టించుకుని రాజీనామా చేసిన తమ ఉద్యోగాలు తమకు ఇవ్వాలని కోరారు.

రాజధాని నిర్మాణానికి వైష్ణవి విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని, అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి అమరావతి రాజధాని నిర్మాణానికి తన వంతు రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. డిడిని సిఎం చంద్రబాబు నాయుడుకు త్వరలో అందిస్తామని తన తండ్రి డాక్టర్ మనోజ్‌తో కలిసి ఆదివారం విలేకర్లకు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దెందులూరు : 132 కెవి భీమడోలు సబ్‌స్టేషన్ నుంచి ఏలూరు వైపు వెళ్లే లైన్ కండక్టర్ మార్చనున్నట్లు ఆపరేషన్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె పిజి.నటరాజన్ తెలిపారు. ఈ నేపథ్యంలో 17వ తేదీ సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు దెందులూరు మండల పరిధిలోని పోతునూరు, కేతవరం, భీమడోలు మండల పరిధిలోని గుండుగొలను, రత్నాపురం, కోరుకొల్లు గ్రామాలకు సరఫరా నిలిపి నిలిపివేయనున్నట్లు వారు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

పామాయిల్ గెలలు కోస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన దారబోయిన వెంకటేశ్వరరావు(35) మేడిశెట్టివారిగూడెంలో మంతెన సత్యనారాయణరాజు తోటలో పామాయిల్ గెలలు కోయడానికి వెళ్లాడు. పామాయిల్ గెలలను కోస్తుండగా గెడ విద్యుత్‌తీగలపై పడడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు అతడిని సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పాము కాటుకు వృద్ధుడు...

చింతలపూడి : పాము కాటుకు గురై వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని పోతునూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన తలపనేని శ్రీనివాసరావు (77) ఆదివారం తెల్లవారుజామున పంచాయతీ తాగునీరు వదలడానికి వెళ్తుండగా పాముకాటుకు గురయ్యాడు. ఇది గుర్తించని శ్రీనివాసరావు ఏదో కుట్టినట్లు ఉందని పట్టించుకోకుండా తాగునీరు వదిలి ఇంటికి వెళ్లాడు. నొప్పి ఎక్కువగా ఉండడంతో కుటుంబసభ్యులు శ్రీనివాసరావును ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపించినట్లు తెలిపారు.

రైలు నుంచి జారి పడి గుర్తు తెలీని వ్యక్తి...

ఏలూరు స్పోర్ట్స్ : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని ఆశ్రమ ఆసుపత్రి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని ఆశ్రమం ఆసుపత్రి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి జారిపడి మృతి చెందాడు. ఇతని ఎత్తు దాదాపు ఐదు అడుగుల ఐదు అంగుళాలు ఉంటుందని, కోల ముఖం, తెలుపు జుట్టు కలిగి ఉన్నాడు. ఆలివ్ గ్రీన్ రంగు టీ షర్ట్, నలుపు రంగు లోయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలు తెలిసినవారు వెంటనే రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్ఐడి నరసింహరావు చెప్పారు. మృతదేహాని పోస్టుమార్టం నిమిత్తం రైల్వే పోలీసులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

చీరాల బీచ్‌లో నూజివీడు విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చీరాల బీచ్‌లో నూజివీడు విద్యార్థి గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం... నూజివీడు పట్టణంలోని ఆర్‌టిఒ ఏజెంట్‌గా పని చేస్తున్న కోసూరి పూర్ణ కుమారుడు కార్తీక్ మైలవరంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం 15 మంది స్నేహితులతో కలిసి చీరాల వద్ద సముద్రంలోకి దిగారు. అలల తాకిడికి ఇద్దరు మునిగి పోతుండగా ఒకరిని స్థానికులు కాపాడారు. కార్తీక్ ఆచూకీ లభ్యం కాలేదు. గాలింపు చర్యలు చేపట్టారు.

ఉంగుటూరు ఎంపిపి పదవిపై కన్ను

పట్టు కోసం టిడిపి నేతల ప్రయత్నాలు

ఎంపిటిసిలు పార్టీ మారే అవకాశం లేదంటున్న వైసిపి

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొత్త ప్రభుత్వం ఏర్పడింది. సిఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం పూర్తయ్యింది. దీంతో తమ నియోజకవర్గాల్లో పట్టుకోసం టిడిపి నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఉంగుటూరు ఎంపిపి పదవి తమ సొంతం చేసుకోవాలని టిడిపి నాయకులు ఎంపిటిసి సభ్యులను వ్యక్తిగతంగా కలిసి మద్దతు కోరుతున్నారు. అందుకోసం సామ, దాన, దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. 2021లో ఎంపిపి ఎన్నికలు జరిగాయి. అప్పట్లో వైసిపి ప్రభుత్వం ఉండడంతో ఎంపిపి పదవి వైసిపినే సొంతం చేసుకుంది. ఉంగుటూరు ఎంపిపి ఎస్‌సి మహిళకు కేటాయించారు. గోపీనాథపట్నం ఎంపిటిసిగా గెలుపొందిన శ్రీలక్ష్మి ప్రస్తుతం ఎంపిపిగా కొనసాగుతున్నారు. ఈ ఆగస్టు నాటికి దాదాపు మూడేళ్ల పదవీకాలం అవుతుంది. వీరంతా ప్రజాక్షేత్రంలో గెలిచి పదవులు పొందినవారే. ప్రభుత్వం మారడంతో వీరి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం మార్పుతో ఉంగుటూరు ఎంపిపి పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. టిడిపి నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులు ఆరుగురు, జనసేన నుంచి ఒకరు ఉన్నారు. దీంతో 16 మంది వైసిపి ఎంపిటిసిలను టిడిపిలోకి రావాలని వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి సైతం ఆనాడు ఇదేవిధంగా వ్యవహరించింది. నామినేషన్లు వేయకుండా అడ్డుకుంది. వేసిన వారు విత్ డ్రా చేసుకోకపోతే చాలాచోట్ల వారి ఆర్థిక మూలాలపై దాడిచేసి దారికి తెచ్చుకుంది. అప్పట్లో ఇది తీవ్ర విమర్శలకు దారితీసింది. ఉంగుటూరు మండలంలో 23 ఎంపిటిసి స్థానాలో 16 వైసిపి, టిడిపి ఆరు, జనసేన ఒకటి గెలుపొందగా వైసిపి ఎంపిపి పదవిని కైవసం చేసుకుంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వైసిపి సర్పంచులు సైతం అత్యధికంగా టిడిపికే మద్దతు పలుకుతున్న పరిస్థితి నెలకొంది. అయితే వైసిపి ఎంపిటిసిలెవ్వరూ పార్టీ మారే అవకాశం లేదని ఆ పార్టీ అధిష్టానం బల్లగుద్ది చెప్తోంది. పైగా జిఒ ప్రకారం నాలుగు సంవత్సరాల లోపు అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేదని వైసిపి నాయకులు భావిస్తున్నారు. టిడిపి నుంచి ఎంపిపి పదవి ఆశిస్తున్న ఆమె వారి ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ విషయం ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

అధిక ఫీజుల వసూలపై చర్యలేవీ

ఎక్కడా అమలు కాని 2009 విద్యాహక్కు చట్టం

కరపత్రం ఆవిష్కరించిన సిపిఎం నేతలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ముద్రించిన కరపత్రాన్ని స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పేదలకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలన్నారు. కాని ఎక్కడ కూడా ఇది అమలు కావడం లేదన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వారు ప్రతి ఏటా పది శాతం పైగా ఫీజులు పెంచుకుంటూపోతున్నారన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు మాత్రమే కాకుండా, మెటీరియల్ పుస్తకాలు, డిజిటల్ క్లాసులు, ఎసి బ్లాక్‌లు, ఎగ్జామ్ ఫీజు, స్కూలు డెవలప్‌మెంట్ ఫీజులు వంటి రకరకాల పేర్లతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల దగ్గర నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు ఏమైనా కలిస్తున్నారా అంటే అదీ లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి స్కూల్‌లో విద్యార్థులకు విజ్ఞానం పెంచడానికి ప్రత్యేకంగా లైబ్రరీ, ల్యాబ్, క్రీడా పరికరాలతో కూడిన తగినంత ఆటస్థలం ఉండాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడ టీచర్ల నిష్పత్తి, క్లాస్ రూములు, బాత్రూములు ఉండాలన్నారు. కాని ఇవి ఎక్కడ కచ్చితంగా ప్రయివేట్ విద్యాసంస్థల్లో పాటించడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలు, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకుండా ఇష్టానుసారంగా ప్రతిఏటా ఫీజులు పెంచుతున్నటువంటి ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే దీనిపై సిపిఎం ఆందోళన చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు కె.రామాంజనేయులు, వి.సాయిబాబు, బి.జగన్నాధరావు పాల్గొన్నారు.

హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో వృద్ధులు, వికలాంగులు, అనాథ పిల్లలకు సేవ చేయడం అందరూ గర్వించదగ్గ విషయమని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఏలూరు హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ మూడో వార్షికోత్సవం రామకృష్ణాపురం ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ సమీపంలోని బ్రిడ్జి కింద నివాసం ఉంటున్న పేద కుటుంబాలు, అనాథల మధ్య ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ నూర్జహాన్ పెదబాబు హెల్పింగ్ హార్ట్స్ వార్షికోత్సవ కేక్‌ను కట్ చేశారు. అనంతరం పేదలు, అనాథలకు బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు, పరుపులు, దోమతెరలు, దుప్పట్లు, పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, వాటర్ బాటిల్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. అంతేకాకుండా మధ్యాహ్నం విందు భోజనం అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మూడో వార్షికోత్సవం నిర్వహిస్తున్న హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. మంచి ఆశయాలతో ముందుకు వెళ్తున్న విద్యార్థులను మేయర్ నూర్జహాన్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబ్బన శ్రీనివాసరావు, హెల్పింగ్ హార్ట్స్ సంస్థ వ్యవస్థాపకులు షేక్ హాఫీజ్, ఆయన తండ్రి షేక్ సలీం, తల్లి ఆజ్మీ, సేవా సంస్థ సభ్యులు షరీఫ్, ఆలీఫ్, షారూక్, గణేష్, అఖిల్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న మేయర్ నూర్జహాన్

గ్రూపు పరీక్షలకు మూడు నెలల వ్యవధి పొడిగించాలి : డివైఎఫ్ఐ

ఏలూరు అర్బన్ : గ్రూప్-1, గ్రూపు-2, పరీక్షలకు మూడు నెలల వ్యవధి పొడిగించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం(అన్నే భవనం)లో డివైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షులు పి.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ గత ఆరేళ్లుగా మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ లేక నిరుద్యోగులు నష్టపోయారని, నూతన ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టుల నోటిఫికేషన్ ఇవ్వడం హర్షనీయమని, రాష్ట్రవ్యాప్తంగా 25 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. గ్రూప్-1, గ్రూపు-2, పరీక్షలకు మూడు నెలల వ్యవధి పొడిగించాలని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌తో ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం హయాంలో మూసివేసిన పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, ప్రకాష్ పాల్గొన్నారు.

హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా వెంకటరమణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా 2024-2025 సంవత్సరానికి పి.వెంకటరమణ, సెక్రటరీగా ఎస్.సురేష్, కోశాధికారిగా రమాదేవి ఎన్నికయ్యారు. నగరంలోని శనివారపుపేట పంచాయతీ పరిధిలో న్యూ అశోక్ నగర్ కాలనీలో ఉన్న లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రొసీడింగ్ అధికారిగా కెబి.రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హేలాపురి లయన్స్ క్లబ్ తరపున ఎన్నో సేవా కార్య్రక్రమాలు చేశామని తెలిపారు. నూతన కార్యవర్గం ముందు ముందు ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆదరాభిమానాలు గైకొనాలన్నారు. తొలుత హేమసుందర్ డైరెక్షన్‌లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సబికు లను అలరించారు. ఈ సందర్భంగా పలువురు లయన్స్ క్లబ్ సభ్యులను సత్కరించి సన్మానించారు. అనంతరం నూతన లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.వెంకటరమణ మాట్లాడుతూ గతంలో లయన్స్ ఆధ్వర్యంలో ఎటువంటి సేవా కార్యక్రమాలు జరిగాయో అంతకు మించి ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుభాష్ బాబు, సరస్వతి, కె.శ్రీనివాసరావు, సత్యనారాయణ, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P.No.1/2023

కంచుమర్తి సురేష్, S/o.నాగేశ్వరరావు, శివదేవుని చిక్కాల, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. ...పిటిషనరు

Vs

1.బొంద మోహన్‌రావు, S/o.అలంకారం, డోర్‌నెం.5-124, పెదపేట, లంకలకోడేరు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
2.పొన్న మేఘమాల, W/o.యువ నాగేంద్ర, పల్లపు వీధి, దగ్గులూరు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
3.ఇనుకోటి స్నేహలత, W/o.చెల్లమలశెట్టి ప్రదీప్, డోర్‌నెం. 4-43-13, సుబ్బారావుపేట, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా.
4.సంపతి దుర్గారావు, S/o.పెదవీరయ్య శంభునిపేట, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
5.అఫిషియల్ రిసీవర్, ఏలూరు. ...రెస్పాండెంట్స్

పై నెంబర్ I.Pలో పిటిషనరు 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని, అతను 2-4 రెస్పాండెంట్స్ పేరున వ్రాసిన క్రియ దస్తావేజులను (డాక్యుమెంట్ నెంబర్ 2942/2022, 3248/2022 & 3851/2022) రద్దు చెయ్యమని కోరుచు ఇంసాల్వెన్సీ పిటిషన్‌ను దాఖలు చేసి ఉన్నందున సదరు విషయము పుర్రప్రముఖులకు తెలియచేయడం అయినది. 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయుటకు ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పిటిషన్ వాయిదా **రోజున అనగా ది.20-06-2024వ తేదీన ఉదయం 10.30** ని॥లకు మీరు స్వయంగా కానీ ప్లీడర్ ద్వారా కానీ పై కోర్టుకు హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకోనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటిషన్ తీర్మానము చేయబడును అని ఇందు మూలముగా తెలియచేయడము అయినది.

కోర్టు ఆర్డర్ ప్రకారం


నర్సాపురం **జి.వి.సుబ్బారావు,** అడ్వకేటు, పాలకొల్లు.
తేది.16.6.2024 సెల్: 9849418841

జంగారెడ్డిగూడేన్ని అభివృద్ధి చేస్తా

ఎంఎల్ఏ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

అందరి సహకారంతో జంగారెడ్డిగూడెం పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని చింతలపూడి ఎంఎల్ఏ సొంగా రోషన్‌కుమార్ చెప్పారు. మండలంలోని గురువాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని ఆయన ఆదివారం సందర్శించుకున్నారు. అనంతరం చక్రదేవరపల్లిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ద్విచక్ర వాహనాల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ఎంఎల్ఏ రోషన్‌కుమార్ మాట్లాడుతూ వైసిపి హయాంలో కల్తీ మద్యం ఏరులై పారిందన్నారు. జంగారెడ్డిగూడెంలోని కల్తీ మద్యం తాగి సుమారు 27 మంది మృతి చెందారన్నారు. అందరి సహకారంతో జంగారెడ్డి గూడెం పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ప్రజల సంక్షేమమే కాకుండా అభివృద్ధి కూడా ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తన పేరు చెప్పి ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, పనులు చేపిస్తామంటే ఏమాత్రం ఎవరూ నమ్మవద్దని, అలాంటివి ఎదురైతే నేరుగా తనను కలవాలని చెప్పారు. వేగవరంలో ఎన్నికల కౌంటింగ్ రోజున జరిగిన దాడిలో కత్తిపోటుకు గురైన షేక్ ఇమ్రాన్, పారేపల్లి శ్రీనులను పరామర్శించారు. మిషన్ హోమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా రూ.పదివేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పరంగా కూడా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



బాధితులను పరామర్శిస్తున్న రోషన్‌కుమార్

అశోక్‌తేజకు జాతీయ పురస్కారం అభినందనీయం

ప్రజాశక్తి - కామవరపుకోట

తెలుగు సినీ కవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ జాతీయ పురస్కారాన్ని అందుకోవడం పట్ల ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు, ఉమ్మడి గోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు సబ్బి కనకరావు ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. ఆయన తండ్రి సుద్దాల హనుమంతు ఆశయాలను కొనసాగిస్తూ ఉపాధ్యాయ వృత్తిని వదులుకొని అభ్యుదయ సాహిత్యం ద్వారా నేటి సమాజానికి చైతన్య పాఠాలు నేర్పుతూ, పాటలు రాస్తూ ఒక విప్లవాత్మక సందేశాన్ని అందిస్తున్న అశోక్ తేజ భవిష్యత్తులో మరిన్ని సత్కారాలు, అవార్డులు స్వీకరించాలన్నారు. వీరితో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, నరసాపురం

O.S.No.170/2018

Between:

పొత్తూరి వెంకట సత్యనారాయణరాజు వగైరాలు ...వాదులు

మరియు

పొత్తూరి అప్పలరాజు వగైరాలు ...ప్రతివాదులు

సాధారణ పద్ధతిలో ఈ క్రింది వారైన మీకు సమన్లు అమలు కానందున శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికా ప్రకటన ద్వారా 6,7,8 ప్రతివాదులకు ప్రత్యామ్నాయ పద్ధతిలో సమన్లు జారీ

1.ప్రతివాది - 6 : దాట్ల వెంకట సత్య శ్రీహరి, W/o.వి.వి.యస్.భూపతి వర్మ, కలగంపూడి, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.

2.ప్రతివాది - 7 : పొత్తూరి సాయి వెంకట సూర్యశ్రీదేవి, W/o.సత్యనారాయణ, కలగంపూడి, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.

3.ప్రతివాది - 8 : ఇందుకూరి కనక సత్యనాగలక్ష్మి, W/o.వెంకటరాజు, కలగంపూడి, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.

పై దావాలో డిక్లరేషన్ పరిహారం నిమిత్తం మీపై మరియు మరి కొంత మందిపై దావా వేసి యుండుట వలన మీరు గాని, మీ ప్లీడరు ద్వారా గాని, **21వ తేదీ జూన్ నెల, 2024 ఉదయం 10.30 గం॥లకు** పైకోర్టు యందు హాజరు కాగలరు లేనిచో మీ పరోక్షమందు సదరు వ్యాజ్యమును తీర్మాణం చేయబడును.

కె.అమరేశ్వరరావు
అడ్వకేట్. సెల్ : 9063777879

సాగుకు రైతన్న సమాయత్తం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల వ్యాప్తంగా ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతోపాటు అడపదడపా చిరుజల్లులు పడడంతో మండలంలో ఖరీఫ్ సాగు పనులు మొదలయ్యాయి. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో రైతన్నలు తమ పొలం పనులను ప్రారంభించారు. ఎక్కువ శాతం రైతులు నేలను చదును చేసి విత్తనాలు వెదజల్లే పనుల్లో నిమగ్నం కాగా, మరి కొంతమంది రైతులు నారుమళ్ళు పోసేందుకు నారు మడులను తయారు చేసే పనుల్లో ఉన్నారు. మండలవ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే సిద్ధం చేసిన మడుల్లో వరి విత్తనాలను రైతన్నలు వెదజల్లుతున్నారు. పలు గ్రామాల్లో మెట్ట మడులను తయారు చేసుకుని నారుమళ్ల కోసం విత్తనాలను చల్లుకుంటున్నారు. పొలంలో దుంప మడిని తయారు చేసి రైతులు వరి విత్తనాలను చల్లుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో మెట్ట మడుల్లో వరి విత్తనాలను నారుమళ్లల్లో వేస్తున్నారు. ప్రస్తుతం వరి సాగు అవసరాలకు నీరు లేకపోవడంతో రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని ప్రధాన పంట కాలువలకు ఇంకా అధికారులు నీరు వదలకపోవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. జల వనరుల శాఖాధికారులను సాగు నీరు ఎప్పుడు వదులుతారని ప్రశ్నించిన రైతులకు అటువైపు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఒకపక్క కాలువలు రాక, మరోపక్క వరుణుడు కరుణించకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువలకు సాగునీటిని విడుదల చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని మండల రైతాంగం కోరుతున్నారు.

నూజివీడులో

నందిగం అరుణ సంతాప సభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్ : దేశంలో సమానత్వం కావాలంటే కమ్యూనిస్టు పార్టీ వల్ల సాధ్యమవుతుందనిసిపిఎం రాష్ట్ర నాయకులు బిఆర్.తులసీరావు అన్నారు. నూజివీడు పట్టణంలో నందిగం నాగేశ్వరరావు సతీమణి నందిగం అరుణ సంతాప సభను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ జి.రాజు అధ్యక్షతన నాగేంద్రరావు వరలక్ష్మి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు బిఆర్.తులసీరావు మాట్లాడుతూ దేశంలో పాలకవర్గాలు అవలంభిస్తున్న విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసి నిరుద్యోగ సమస్యను పెంచుతుందన్నారు. మతోన్మాదంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి విచ్చిన్నం చేస్తుందన్నారు. నందిగం నాగేశ్వరరావు సతీమణి అరుణ చివరి వరకు సిపిఎం ఆశయాలు, సిద్ధాంతాల కోసం పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు చలసాని వెంకట రామారావు, పాతూరి రవి, పవన్, రాజారావు, హనుమాన్, ఇ.దుర్గారావు, శేషుబాబు, బేబి, శైలజ పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 152/2019

బిట్వీన్:

విజయా బ్యాంకు, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం **-వాది**

అండ్

మర్నీడి కవిత అండ్ అనదర్ ***-ప్రతివాది/ ప్రతివాదులు***

సమన్స్ టు:

D-1: మర్నీడి కవిత, W/o. శివరామకృష్ణ, డో.నెం. 2-47, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం - 534268, ప॥గో॥జిల్లా.

D-2: మర్నీడి శివరామకృష్ణ, S/o. శ్రీనివాసరావు, డో.నెం. 2-47, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం - 534268, ప॥గో॥జిల్లా.

మీరు వాది విజయా బ్యాంక్, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 24-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:16-06-24 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 45/2020

బిట్వీన్:

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**

అండ్

వేముల సత్యవతి అండ్ అనదర్ ***-ప్రతివాది/ ప్రతివాదులు***

సమన్స్ టు:

D-1: వేముల సత్యవతి, W/o. ప్రసాదు, డో.నెం. 5-114, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం - 534268, ప॥గో॥జిల్లా.

D-2: పజ్జూరి వీరమణి, W/o. శ్రీనివాసరావు, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, యలమంచిలి మండలం - 534268, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 24-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:16-06-24 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 60/2020

బిట్వీన్:

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**

అండ్

వేముల సుజాత అండ్ అనదర్ ***-ప్రతివాది/ ప్రతివాదులు***

సమన్స్ టు:

D-1: వేముల సుజాత, W/o. కృష్ణ, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 24-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:16-06-24 ఫోన్: 08814-274628